క్లుప్తంగా

10లోగా దరఖాస్తు చేసుకోండి

లింగాల: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 10వ తేదీ లోపు రైతుబంధు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 70 మంది వరకు రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలియజేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు తమ దగ్గరలోని రైతు వేదికలో ఏఈఓలకు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను గడువులోగా అందజేయాలని సూచించారు.

అందుబాటులో యూరియా, డీఏపీ

లింగాల: వానాకాలం సీజన్‌కు సంబంధించి పీఏసీఎస్‌లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సీఈఓ పాండు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లింగాల, అంబట్‌పల్లి గోదాంలో 800 బస్తాల యూరియా, అదే విధంగా 300 బస్తాల డీఏపీ విక్రయానికి సిద్ధంగా ఉందన్నారు. యూరియా బస్తా ఒక్కంటికి రూ.266, డీఏపీ రూ.1,350 ధర ఉంటుందని తెలియజేశారు. ఎరువులు కావాల్సిన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లను సమర్పించి కొనుగోలు చేయాలని కోరారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లోని రైతువేదిక వద్ద కార్మికులకు శనివారం వైద్య సేవలు అందించారు. నిర్మాణ రంగంలో కార్మికులుగా పనిచేస్తూ లేబర్ కార్డు రిజిస్టర్ చేసుకున్న కార్మికులందరికీ తెలంగాణ పీపీహెచ్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో 60 రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. కల్వకుర్తి లేబర్ ఆఫీసర్ మహేందర్, భాస్కర్, సురేష్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు లేబర్ ఆఫీసర్ మహేందర్ వివరించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కోడేరు: మండల కేంద్రానికి చెందిన రెండో ఎంపీటీసీ సాప్పరి నర్సింహ శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్‌ని నమ్మి పార్టీలో చేరిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, బంగారయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, చెన్నయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కమిటీ ఎన్నిక

తెలకపల్లి: మండల పరిధిలోని బొప్పల్లి గ్రామ బీఎస్పీ కమిటీని శనివారం మండల అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, రాంచందర్‌ను ఎన్నుకున్నారు.

డీఎల్‌పీఓకు ఫిర్యాదు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలోని గ్రామ కంఠం భూమిలో అక్రమంగా మొరం కట్టలు వేయడంతో ప్రభుత్వ భవనాలు ముంపునకు గురవుతున్నాయని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తిరుపతిరావు డిమాండ్ చేశారు. గ్రామంలోని గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, పశువుల దవాఖానాను ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 1, 3కు సంబంధించిన భూ యాజమాని తన హద్దులు దాటి గ్రామం కంఠం భూమిలో మొరం కట్టలు వేశాడని చెప్పారు. దీంతో వర్షం నీరు అక్కడే నిలిచి భవనాల్లో నీరు చేరుతుందన్నారు. దీనిపై డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశామన్నారు.

కేసు నమోదు

తెలకపల్లి: ఇద్దరు వ్యక్తులు గొడవపడి దాడి చేసుకోవడంతో పోలీసులు కేసునమోదు చేశారు. ఏఎస్సై సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామానికి చెందిన కొత్ర రాము, ఆంజనేయులు శుక్రవారం సాయంత్రం గొడవపడ్డారు. రాము, ఆంజనేయులుకు సంబంధించిన పశువుల పాకలు పక్కపక్కనే ఉండడంతో రాము షెడ్ ఏర్పాటు చేసుకునేందుకు అక్కడ ఉన్న కొమ్మలు అడ్డం రావడంతో ఆంజనేయులును అడిగి షెడ్‌కు అడ్డం ఉన్న కొమ్మలను నరికివేశాడు. దీంతో కొమ్మలు నరకమంటే చెట్లు ఎందుకు నరికావని ఆంజనేయులు అడగడంతో మాటామాటా పెరిగి గొడవకుదారితీసింది. ఇరువురి దాడి చేసుకున్నారు. శనివారం ఇరువురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఏఎస్సైలు అంజయ్య, సుధీర్‌కుమార్ ఇరువురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని చందుబట్ల గేటు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్కపల్లి మండలం పెద్దపల్లికి చెందిన మల్లేష్(23) జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ద్విచక్రవానంపై స్వగ్రామానికి వెళ్తుండగా చందుబట్ల గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.



కల్వకుర్తిలో



కొల్లాపూర్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రంగినేని జగదీశ్వరుడు

వైఎస్సార్ ఆశయాలు కొనసాగిస్తాం

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లో దివంగత మాజీ సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామాల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

- జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఇంట్లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ దూరం పాదయాత్ర చేసి, 2004 శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, అనేక పథకాలు ప్రవేశపెట్టి యావత్ తెలుగు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప పాలకుడు వైఎస్సార్ అని కొనియాడారు.

–'సాక్షి' నెట్‌వర్క్



కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తెలకపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



అమ్రాబాద్‌లో...



అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బిజినేపల్లిలో..



ఉప్పునుంతలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



నాగర్‌కర్నూల్‌లో..



వెల్దండలో...

బీజేపీతోనే ప్రజా సంక్షేమం

కొల్లాపూర్: బీజేపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి రోజారమణి అన్నారు. శనివారం కొల్లాపూర్‌లోని 10వ వార్డులో మహిళా చైతన్యయాత్ర నిర్వహించారు. స్థానిక మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మహిళలతో పాటు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను తెలియజేశారు. కొల్లాపూర్‌లో బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

చలో వరంగల్ బయలుదేరిన బీజేపీ నాయకులు

కోడేరు: మండల కేంద్రంతో పాటు నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, జనుంపల్లి తదితర గ్రామాల నుంచి వరంగల్‌లో నిర్వహించే విజయ సంకల్ప సభకు మండల నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బాలపీరు, రామకృష్ణ మాట్లాడారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు.



వరంగల్ సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండల పరిధిలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద ఎలాంటి హెచ్చరిక సూచికబోర్డులు లేకుండా లారీని నిలిపిన డ్రైవర్ బస్వరాజ్‌పై శనివారం మృతుడి అన్న వెంకటాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి ఇంటి నిర్మాణానికి ఉపయోగించే బండల లారీ వస్తుంది. మార్గమధ్యంలో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ పంపు సమీపం వద్ద శుక్రవారం రాత్రి డ్రైవర్ లారీని నిలిపాడు. ఉప్పునుంతల మండలానికి చెందిన విష్ణుచారి హైదరాబాద్ నుంచి బైక్‌పై వచ్చి ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం మృతదేహానికి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు

బల్మూర్: మండలంలోని నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన రహదారిలోని పోలిశెట్టిపల్లి స్టేజీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ రామచంద్రం తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తన బైక్‌పై వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా.. అచ్చంపేట వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఉప్పరిపల్లికి చెందిన కుర్మయ్య ఢీకొట్టాడు. ప్రమాదంలో రామచంద్రం తలకు తీవ్ర గాయం కావడంతో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వెల్దండ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రేణయ్య తెలియజేశారు.

తుమ్మెన్‌పేటలో రాకపోకలకు అంతరాయం

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలోని పీఏసీఎస్ గోదాం ప్రాంతంలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవడంతో వాహదారులు అవస్థలు పడుతున్నారు. గోదాం నిర్మాణ సమయంలో రోడ్డు పక్క నుంచి డ్రైయినేజీ తీయకుండానే సీసీ వేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు ఎక్కడికి వెళ్లే వీలులేక అక్కడే నిలిచి గుంతగా మారింది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి టౌన్: పాఠశాల స్థాయిలో గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ నిర్వహించిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని జేపీనగర్ పాఠశాలలో 1997–98 విద్యాసంవత్సరంలో చదువుకున్న వారంతా శనివారం కలుసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

నేడు కొండనాగులలో

బల్మూర్: మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులకు సత్కారం, సన్మానం చేయనున్నట్లు వివరించారు.

జోరందుకున్న సాగు

పెంట్లవెల్లి: మండలంలో వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో రైతులు ఆనందంతో వ్యవసాయ సాగులో నిమగ్నమయ్యారు. కొంత కాలంగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఎవరి పొలాల్లో వారు పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను దున్నడం, మరికొందరు వరినాట్లు వేయడం, విత్తుకోవడం కనిపించారు.



గోప్లాపూర్ విత్తనాలు వేస్తున్న రైతు

మూడో రోజుకు చేరిన సమ్మె

కోడేరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది.

తాడూరు: తమ సమ్యలు పరిష్కరించాలంటూ మూడు రోజుల నుంచి మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సింగిల్ విండో మాజీ చైర్మన్ వెంకట్‌రామారెడ్డి క్వింటాలు బియ్యం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులు సక్రమంగా తమ విధులు బాధ్యతతో నిర్వహిస్తేనే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేపీపీఎస్ నాయకులు కాశన్న, కార్మికులు సుబ్బయ్య, ఆనంద్, ఎల్లయ్య, వెంకటయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: గ్రామపంచాయతీ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే సమ్మె చేస్తున్న కార్మికులను తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం సమంజసం కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బందిని మల్టీ పర్పస్ విధానంలో పనిచేయించుకుని, కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బాలస్వామి, చంద్రయ్య, ఆనంద్, సిద్ధయ్య, రాంబాబుగౌడ్, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మద్దతు తెలిపి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు

నాగర్‌కర్నూల్ రూరల్/ పెంట్లవెల్లి: గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు వారికి మద్దతు తెలిపారు.

బీసీలకు 60 సీట్లు కేటాయించాలి

కల్వకుర్తి రూరల్: రాబోయే శాసనసభ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఈ నెల 15న హైదరాబాద్ కేబీఆర్ పార్క్‌లో నిర్వహించే బీసీ ప్లీనరీని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాల్లో ఒక్కరే బీసీ ఎమ్మెల్యే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో 4కి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ పరిధిలో ముగ్గురు మాత్రమే ఉన్నారని ఆ సంఖ్యను పెంచాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 శాసనసభ స్థానాలు బీసీలకు ఇవ్వకుంటే వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీసీని ముఖ్యమంత్రిని చేసే పార్టీకే బీసీలు మద్ధతు ఇస్తారని చెప్పారు. బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌చారి, సంజీవ్, బాలయ్య ముదిరాజ్, రాజు, భానుచందర్, భగవంత్‌గౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న నాగేశ్వర్ గౌడ్

విద్యార్థిని ఉన్నత చదువుకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

తాడూరు: మండలంలోని నాగుదేవుపల్లికి చెందిన పెంటయ్య కొన్ని రోజుల కిందట దుంధుబీ వాగులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఆయన కుమార్తె మానస టీటీసీ చదువుకు వెళ్లేందుకు హాస్టల్ ఫీజు కోసం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తన సొంత డబ్బులు రూ.50 వేలను శనివారం అందజేశారు. విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో, స్పందించిన ఆయన ఆర్థిక సాయాన్ని మానస తల్లి రేణుకకు అందజేశారు. యార రమేశ్, మాధవరెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ర్యాంకర్‌కు సన్మానం



చిద్విలాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

తెలకపల్లి: కేకేరెడ్డి పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి వావిలాల చిద్విలాస్ రెడ్డిని కేకేరెడ్డి పాఠశాల యాజమాన్యం శనివారం సన్మానించింది. చిద్విలాస్‌రెడ్డి కేకేరెడ్డి పాఠశాలలో పూర్వ విద్యార్థి. జేఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని శనివారం పాఠశాల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సలహాదారుడు డాక్టర్ కె.రఘురాంరెడ్డి విద్యార్థిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాష, కిషోర్, శివ, విష్ణు, కార్తీక్, బాలు, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని విద్యార్థిని అభినందించారు. ఈ ప్రాంత వాసి అయిన వావిలాల చిద్విలాస్ రెడ్డి ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు సాధించాడని సేవాభారతి తెలకపల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌రెడ్డి, రవి, శ్రీరాములుగౌడ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు కేంద్ర పథకాలపై వివరించాలి

వెల్దండ: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయకుండా అడ్డుకుంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. ఫసల్ బీమా పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫసల్ భీమాతో రైతులు సాగుచేసిన పంటలకు భీమా వస్తుందన్నారు. భీమాను పత్తిపంటకు 21 జిల్లాల్లో, వరిపంటకు 31 జిల్లాల్లో, మిరప 5 జిల్లాల్లో, మొక్కజొన్న 6 జిల్లాల్లో, కందిపంట 3 జిల్లాల్లో అమలు చేయాలన్నారు. పార్టీ కార్యకర్త ప్రతి గ్రామంలో ప్రజలకు కేంద్ర పథకాలను వివరించాలన్నారు. విజేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రామస్వామి, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తున్న 'ఉప్పల'



ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న సురేష్ తదితరులు

కల్వకుర్తి రూరల్: సమాజంలో నిరుపేద ప్రజల సొంతింటి కలను ఉప్పల చారిటబుల్ ట్రస్టు అధినేత ఉప్పల వెంకటేష్ తీరుస్తున్నారు. మండలంలోని మార్చాలలో ఐదుగురు, పంజుగులలో 10 మందికి, గుండూరులో ఐదుగురికి, ముకురాలలో ఐదుగురికి ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో పాటు వారి ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం మండలంలోని మార్చాలకి చెందిన నిరుపేద ముస్లిం మౌలానాబి ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. పంజుగులకు చెందిన తిరుపతమ్మ ఇంటి నిర్మాణం కోసం 60 బస్తాల సిమెంట్‌ను పంపించారు. మాజీ వార్డు సభ్యులు బాలకిష్టయ్య గౌడ్, రవీంద్రాచారి, స్వామి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు

అచ్చంపేట రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ.. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు దక్కాయి. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 2022–23 సంవత్సరంలో దసరా ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించగా.. అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఎండీ సజ్జనార్ ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీదేవి, డీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న మహిళా కండక్టర్

డ్రైయినేజీ నిర్మించాలని నిరసన



కల్వకుర్తి రూరల్: పట్టణం నుంచి ఎల్లికల్‌కి వెళ్లే ప్రధాన రోడ్డుపై మురుగు పారుతుండని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలో నేటికీ ప్రధాన రహదారిపై మురుగు పారుతుందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. నర్సింహ, దుర్గాప్రసాద్, రవిగౌడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అంతయ్య ఆశయాలను కొనసాగిద్దాం

అచ్చంపేట రూరల్: అంతయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా నాయకుడు మల్లేష్ కోరారు. శనివారం మండలంలోని సింగారంలో సీపీఎం ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ నెల 10న మండలంలోని సింగారంలో అంతయ్య స్మారక స్థూపం ఏర్పాటుతో పాటు సభను నిర్వహించనున్నామని చెప్పారు. సభకు మాజీ రాజ్యసభ సభ్యుడు మధు, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలియజేశారు. కార్యక్రమంలో నిర్మల, బక్కయ్య పాల్గొన్నారు.